# పరమాన్నమైనా పెట్టవే అమ్మా!

నే నొకసారి మా లక్ష్మిని చూడటానికి వెళ్ళాను. లక్ష్మి చరిత్ర అంతగా చెప్పవలసిన పనేమీ లేదు. కారణం ఒకటే. లక్ష్మి చరిత్రకు ఈనాటి భారత స్త్రీ, అథమం ప్రతి ఆంధ్ర స్త్రీ జీవితంతోనూ సాపత్యం ఉంది.

మన దేశంలో స్త్రీలకు తగిన అవకాశా లిచ్చి, వారి అభివృద్ధికి దోహద మిచ్చినట్లయితే దేశం గతి బాగుపడు తుందేమోనని నా ఆశ. కాని ఏదీ, లక్ష్మిలాంటి స్త్రీలు కట్టెదుట ఉన్నంత కాలము భవితవ్యం గురించి కలలు కనడం అంత ఉత్సాహకరమైన విషయం కాదు.

ఇంతకీ లక్ష్మిని చూడడానికి వెళ్ళినప్పుడు జరిగిన సంఘటన గురించి చెప్పడమే నా కోరిక. లక్ష్మికి ఒక కొడుకు. వారి పరిస్థితి ఏమీ బాగులేదు. తినడానికి కూడా లేక పస్తుపడుకుని ఎలాగో పిల్లవాడికైనా రెండు మెతుకులు పడవేయడానికి ఆ భార్యాభర్తలు నానా బాధలుపడి, చివరికి అవమానాలకు తల ఒగ్గడానికి వెనుదీసేవారు కారని నాకు తెలుసు.

ఈనాటి పరిస్థితిలో ఒక విశేషం ఉంది. సుఖాన్ని ఎవరూ సహించకపోవచ్చు. అర్థం చేసుకొనడానికైనా సామర్థ్యం లేకపోవచ్చు. కాని కష్టాన్ని మాత్రం ప్రతిఒక్కరు అతి సులభంగా అర్థం చేసుకోగలరు. దారిద్ర్యం, యాతన, అవమానం దుఃఖాలతో జీవితం నిండని మానవుడు మచ్చుకైనా ఈనాడు లేడు.

మా లక్ష్మి కొడుకు చిట్టిబాబు. అప్పుడప్పుడే చిట్టి బాబు కొత్తగా మాటలు నేర్చుకుంటున్నాడు. మధ్యాహ్నం భోజనాలు అయిపోయాయి. నేను నిద్రపోవడానికి ప్రయత్నం చేస్తున్నాను సాయంత్రం వంటకు బియ్యం ఎక్కడైనా పుట్టించే ప్రయత్నంలో లక్ష్మి భర్త బయటికి వెళ్ళాడు.

వీధిలో ఆడుకుని లోపలికి వచ్చాడు చిట్టిబాబు. లక్ష్మి బట్టలు ఉతుక్కుంటోంది.

ఆకలి వేసింది కాబోలు— "అమ్మా, తినడానికి ఏమైనా పెట్టవే!" అని అడిగాడు చిట్టిబాబు.

"ఏమీ లేదురా నాన్నా!" అంది లక్ష్మి.

"ఓ డబ్బు ఇయ్యవే అమ్మా! ఏమైనా కొనుక్కుంటాను" అన్నాడు చిట్టిబాబు.

"నాన్నగారు వచ్చిన తరువాత ఇస్తారు. కొనుక్కుందువుగానిలే" అని సమాధాన పరచడానికి ప్రయత్నించింది లక్ష్మి.

"ఆకలి వేస్తోందే అమ్మా!" అని ఏడుపు ముఖం పెట్టాడు బాబు.

లక్ష్మికికూడా దుఃఖం పొర్లుకొచ్చింది.

అంతలోనే "పోనీ, పరమాన్నమైనా ఉంటే పెట్టవే!" అని అడిగాడు బాబు.

చిట్టిబాబుకు పరమాన్నమంటే ఇష్టం. పాపం! తిండికైనా గతిలేనివారి ఇంట్లో నిత్యమూ పరమాన్నముండదని ఆ నిర్భాగ్యుడికి తెలియదు.

ముఖ్యంగా, అర్థంచేసుకుని కొంత నిర్లిప్తత, వైరాగ్యం అలవరచుకోనలేనివాడు అవహేళనకు తావులేకుండా చేస్తుంది దారిద్ర్యం. చిట్టిబాబు మాటలలోని వ్యంగ్యం లక్ష్మికి అంకుశపు పోటులా తగిలింది. లేచి ఒక్కటి ఒడ్డించింది. చిట్టిబాబు ఏడ్చాడు.

జీవితంలోని సుఖదుఃఖాలను సమానంగా అనుభవించగలిగిన శక్తి, సహనమూ లక్ష్మికి లేకపోయాయి.

లక్ష్మి చదువుకున్నదయితే, జీవిత నిర్వాహణకి మరొక ఆధారం కల్పించుకొనగలిగిన శక్తి ఉన్నట్లయితే చిట్టిబాబు తినడానికి ఏమైనా సమకూర్చగలిగి ఉండేది. కొనుక్కోడానికి ఒక డబ్బయినా ఇవ్వగలిగి ఉండేది. చిట్టిబాబుకు ఇష్టమైన ఆ పరమాన్నమే పెట్టి ఉండేది. అథవా చిట్టిబాబు మాటలలో గర్భితంగా ఉన్న వ్యంగ్యానికి కోపం తెచ్చుకోక, చిరునవ్వు నవ్వకొనగలిగి ఉండేది. ఆమె కా అవకాశమైనా లేకపోయింది.

చిట్టిబాబు మరెన్నడైనా తల్లిని దేనికైనా అభ్యర్థించడం నాకు తెలియదు. తనను కొట్టినదన్న బాధకన్న, తనకేమీ పెట్టనందుకు, పెట్టలేకపోయినందుకు తల్లి ఏడ్చిన ఏడుపే ఆ పసిపిల్లవాని హృదయంలో గాఢంగా నాటుకొనిపోయింది.

చిన్నతనమంతా దుఃఖమయమైన నికృష్ట వాతావరణంలో పెరిగిన, అల్పమైన మొలకలు జీవితంలోని ఝంఝూమారుతాలకు ఎదురొడ్డి నిలువలేవు.

ప్రాయశః ఇది చాల చిన్న సంఘటన కావచ్చు. కాని, ఈ సంఘటనే నా హృదయాన్ని కలచివేయగలిగింది.

ఆ తరువాత నా ఆలోచనలు బహుముఖంగా సాగడం ప్రారంభించాయి. ఇట్టివే మరొకటి రెండు సంఘటనలు జరిగితే చిట్టిబాబు లేత హృదయంలో సంతోషానికి తావు ఉండకపోవచ్చు.

మరొకవంక లక్ష్మిహృదయంలో కర్కశత్వం కరడు కట్టవచ్చు. ఏమైనా కన్నబిడ్డకు కడుపునిండా తిండి పెట్టలేకపోవడానికి బాధ్యత లక్ష్మిదిమాత్రం కాదు.